మరుభూమికి మెరుగులు

- రూ.10 లక్షలతో పనులు
- దహన సంస్కారాలకు తప్పనున్న ఇబ్బంది
- హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ పోరాట ఫలితం
- ఆనందం వ్యక్తం చేస్తున్న 12 వార్డుల ప్రజలు


అమలాపురం శ్మశాన స్థలాన్ని గ్రావెల్‌తో చదును చేసిన దృశ్యం


శ్మశాన వాటికలో నిర్మిస్తున్న అంతర్గత సీసీ రోడ్లు

అమలాపురం టౌన్: ఒకప్పుడు అది శ్మశానమో లేదా మున్సిపాలిటీ డంపింగ్ యార్డో తెలియనంతగా ఉండేది. ఎటు చూసినా చెత్త కుప్పలు ఉండేవి. ప్రస్తుతం చెత్త కుప్పలకు దూరంగా కేవలం శ్మశానంగా అభివృద్ధి చెందుతోంది. త్వరలోనే ఈ పనులన్నీ పూర్తయి ప్రజలకు పూర్తి అందుబాటులోకి రానుంది. ఈ శ్మశానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు దాదాపు 12 వార్డులకు చెందిన 25 వేల మంది మున్సిపాలిటీతో యుద్ధమే చేశారు. పార్టీలకు, సామాజిక వర్గాలకు అతీతంగా అందరూ ఏకమై ఇటీవల నిరసన ప్రదర్శనలు చేయడంతో ఈ విజయం దక్కింది. ఇక చివర దశకు చింతలేదు.

ఇదీ సంగతి

అమలాపురం బైపాస్ రోడ్డులో ప్రధాన పంట కాలువ చెంత తొలుత మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్, దానిని ఆనుకుని శ్మశానం ఉంది. మున్సిపాలిటీ వాళ్లు చెత్తనంతా శ్మశానం దగ్గర వేసేవారు. ఇలాంటి దుస్థితిపై హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ ఒకటి ఏర్పడి మున్సిపాలిటీకి వ్యతిరేకంగా ధర్నాలు, నిరసనలు చేపట్టింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఇతర మున్సిపల్ అధికారులు కమిటీ ప్రతినిధులతో స్వయంగా శ్మశానానికి వచ్చి చర్చలు జరిపారు. రెండు సార్లు జరిగిన చర్చలు అదిగో ఇదిగో చేస్తామని హామీలతో నడిచాయి. చివరకు శ్మశాన అభివృద్ధి కమిటీ ఓ తేదీని గుడువుగా సూచించి ఆ లోపు శ్మశానాన్ని అభివృద్ధి చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని కమిటీ ప్రతినిధులు హెచ్చరించారు. ఈ హెచ్చరికలకు దిగి వచ్చిన మున్సిపాలిటీ పది రోజుల కిందట శ్మశానంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రానున్న పది రోజుల్లో శ్మశాన అభివృద్ధి పనులు పూర్తయి ఇక దహన సంస్కారాలకు పూర్తి సౌకర్యాలు సమకూరనున్నాయి.

రూ.10 లక్షలతో అభివృద్ధి

హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ పోరాట ఫలితంగా మున్సిపాలిటీ శ్మశాన అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించి పనులను యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టింది. శ్మశానంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించింది. శ్మశానం స్థలమంతా గ్రావెల్‌తో నింపింది. అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మిస్తోంది. శవాలకు అంత్య క్రియలు నిర్వహించే బెడ్స్‌ను ఆధునీకరిస్తోంది. పంట కాలువకు పావం చాలను నిర్మిస్తోంది. శ్మశానం స్థలంలో టైల్స్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 29వ వార్డు పరిధిలో ఈ శ్మశానం ఉండడంతో ఆ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ పలు కౌన్సిల్ సమావేశాల్లో శ్మశాన దుస్థితి గురించి ప్రస్తావించారు. ఎట్టకేలకు హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీలో ఆ కౌన్సిలర్ ఒక సభ్యుడిగా ఉండి పోరాటం చేశారు. పార్టీలకు అతీతంగా నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కముజు రమణ, ఏడిద శ్రీను, కుడుపూడి ఈశ్వరరావు, మోసుగంటి చిట్టిబాబు, ముత్తాబత్తుల గణేష్, కల్వకొలను ఉమ, పాము ఏసు, కడలి శ్రీనివాస్, కల్వకొలను బాబి తదితరులు శ్మశాన అభివృద్ధి కోసం ఉద్యమించారు.

పోరాటంతోనే అభివృద్ధి



వార్డు కౌన్సిలర్‌గా నేను గత మూడున్నరేళ్లుగా మున్సిపాలిటీ అధికారులకు శ్మశాన అభివృద్ధి కోసం అడుగుతూనే ఉన్నా ఏ రోజు పట్టించుకోలేదు. చివరకు పార్టీలకు, కులాలకు అతీతంగా హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ పేరుతో పోరాటం చేసినందుకే మున్సిపాలిటీ ఇన్ని రూ.లక్షలు పెట్టి అభివృద్ధి పనులు చేపడతోంది. పట్టణంలో సేకరించిన చెత్తకు శ్మశానం పక్కన ఉన్న డంపింగ్ యార్డ్ స్థలం ఎంత మాత్రం సరిపోదు. ఎప్పటికైనా డంపింగ్ యార్డ్‌కు ప్రత్యామ్నాయ స్థలాన్ని మున్సిపాలిటీ సేకరించినప్పుడు మాత్రమే శ్మశాన సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

– చిత్రపు రామకృష్ణ, కౌన్సిలర్, 29వ వార్డు, అమలాపురం మున్సిపాలిటీ

చెత్త పోగేత పేరుతో రూ.5 కోట్ల నిధుల వృథా

డంపింగ్‌యార్డ్‌లో చెత్త కుప్పలు కొండలుగా పెరిగిపోయినప్పుడు, ఇంక చెత్తను దించే దారి లేక బైపాస్ రోడ్డు చెంతనే, శ్మశానం, యార్డ్‌లోకి వచ్చే రోడ్డును చెత్తతో నింపేసేవారు. గత పదేళ్లలో రోడ్ల పైకి చేరిన చెత్తను, యార్డ్‌లో పేరుకుపోయినప్పుడల్లా జేసీబీలతో చెత్తను ఎగదోసేందుకు పట్టుకు రూ.5 లక్షల చొప్పున మున్సిపాలిటీ నిధులు కేటాయించింది. ఇలా పదేళ్లలో రూ.5 కోట్ల నిధులు చెత్త పాలయ్యిందే తప్ప ఫలితం మాత్రం లేదు. ఇంత నిధులు వెచ్చించినా అటు డంపింగ్ యార్డ్‌గానీ ఇటు శ్మశానం అభివృద్ధి చెందలేదు. కానీ భారీగా నిధులు మింగేశారు.

క్లుప్తంగా

శ్మశానం ఆధునీకరణ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అముడా చైర్మన్ స్వామి నాయుడు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: పట్టణంలోని 29వ వార్డులో ఉన్న శ్మశానం ఆధునీకరణ పనులను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పలువురు కౌన్సిలర్లు ఆదివారం పరిశీలించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా త్వరలోనే ఈ అభివృద్ధి పనులు పూర్తయి అందుబాటులోకి రానున్నాయని స్వామినాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు తిక్కిరెడ్డి నేతాజీ, ఆశెట్టి ఆదిబాబు, సామాజిక కార్యకర్త వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


ఉప్పలగుప్తంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి పెద్దూరు కాలువగట్టు ప్రాంతంలో రూ.5లక్షల పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో ఉన్న క్రమేపి రోడ్లను అభివృద్ధి చేస్తామని సర్పంచ్ చిన్నవరాజు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చిక్కం వర ప్రసాద్ రావు, తొత్తరమూడి కనకమహాలక్ష్మీ, నీటి సంఘం అధ్యక్షుడు రవికుమార్, పాపారాజు, వెంకటకృష్ణ, ఏసు, సూర్యమోహన్ పాల్గొన్నారు.

వైభవంగా బంగారక్క మట్టి విగ్రహానికి పూజలు

అమలాపురం టౌన్: స్థానిక చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థానం ఉన్న ప్రాంత ప్రజలు గత 150 సంవత్సరాలుగా రావి చెట్టు మొదట్లో కొలుస్తున్న బంగారక్క దేవత పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ దేవస్థానానికి సమీపంలో ఉన్న బంగారక్క చెరువు నుంచి తెచ్చిన మట్టితో బంగారక్క విగ్రహాన్ని తయారు చేసి రోజంతా స్థానికులు పూజలు చేసి సాయంత్రమయ్యాక ఆ మట్టి విగ్రహాన్ని మళ్లీ బంగారక్క చెరువులో కలిపేయం ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.

75 మందికి వైద్య పరీక్షలు

ఉప్పలగుప్తం: ఎస్.కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి అధ్యక్షతన ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవి ఈఎన్‌టీ వైద్యులు కాశిన రవికుమార్ 75 మందికి ఉచితంగా చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు సర్పంచ్ చిట్టికుమారి ఉచితంగా మందులను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే చిన్నీ, అంగాని సాంబశివరావు, సిబ్బంది బద్రి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

ముమ్మిడివరం: గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత నిస్తోందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో రూ.25 లక్షలతో నిర్మించబోయే కాశివాని తూము చింతల మెరక రోడ్డు, రూ.25 లక్షలు ఎంపీ గంటి హరీష్‌మాదుర్ మంజూరు చేసిన నిధుల నుంచి నిర్మించే మట్టాడి పాలెం రోడ్డు పనులకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్,ములపర్తి బాలకృష్ణ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమీషనర్ పి.రవివర్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన అరుణ

కాట్రేనికోన: మండల పరిషత్ అధ్యక్షురాలుగా యేడిది అరుణ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఎంపీపీ పాలెపు లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలుగా పని చేస్తున్న యేడిది అరుణకు తాత్కాలిక ఎంపీపీ బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన అరుణ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇటీవల మృతి చెందిన ఎంపీపీ పాలెపు లక్ష్మికి ఎమ్మెల్యేతో పాటు సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, యేడిది చక్రపాణీ రావు, గుత్తుల సాయి, నల్లా నరసింహమూర్తి, నడింపల్లి సూరిబాబు, మమ్మురాజు, గంటి వెంకటసుధాకర్, చల్లగల వెంకట లక్ష్మీ, యేడిది సుబ్బు, మాజీ ఎంపీపీ ఆకాశం బాబు, నాగేశ్వర రావు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తాచుపాము కలకలం

యానాం: మెట్టకూరు పాత హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వద్ద నివాసం ఉంటున్న అనసూరి సాయి గృహంలో భారీ తాచుపాము కనిపించింది. ఈ నేపథ్యంలో దానిని పట్టుకోవడానికి స్థానికులు అమలాపురానికి చెందిన స్నేక్ క్యాచర్ రవివర్మ సమాచారం అందించారు. రవివర్మ ఘటన స్థలానికి చేరుకుని సుమారు 7 అడుగుల తాచు పామును చాకచక్యంగా సీసాలో బంధించారు.

అయినాపురం రోడ్డును తక్షణమే ఆధునీకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ మోకా రామారావు తదితరులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం–కాట్రేనికోన వయా అయినాపురం మీదుగా వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును తక్షణమే ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల నాయకుల సమావేశం కోరింది. అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సోమిదేవరపాలెం, సూరాయిచెరువు, అయినాపురం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు గ్రామస్తులు సమావేశమై రోడ్డు నిర్మాణానికి 2019లో నిధులు మంజూరైన ఇప్పటి వరకు ఆధునీకరణ చేపట్టక పోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినాపురం రోడ్డు అధ్వానంగా మారటంపై ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు పరిస్థితిని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకు వెళ్లి కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అయినాపురం సర్పంచ్ మోకా రామారావు, బొంతు నాగ రాజు, మట్టా సత్తిబాబు, రెడ్డి నాని,ఉంగరాల కుమార్, అయ్యల రమేష్, సానబోయిన చంటి, సలాది సూరిబాబు, సలాది త్రినాథరావు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానం


అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న యోగాశ్రమ శిక్షకులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీస్వామి వివేకానంద యోగ ఆశ్రయంలో యోగా శిక్షణ పొందుతున్న 23 మంది రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, రాజోలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్తవ అవసరమై చికత్స పొందుతున్న రోగులు, గర్భిణులకు రక్తదానం చేశారు. ఆ రెండు నగరాలు, పట్టణం, మండల కేంద్రానికి వీరు వెళ్లి మరీ రక్తదానం చేసి వచ్చారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు, బరువు తక్కువ ఉన్న రోగులకు రక్తమిచ్చారు. రాజమహేంద్రవరం, రాజోలు ఆస్పత్రుల్లో గర్భిణులకు, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త హీనతతో బాధపడుతున్న రోగులకు రక్త దానం చేశారు. అమలాపురం వివేకానంద యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరు రక్తదానం చేశారు. యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్, రక్తమిచ్చిన యోగా శిక్షకులను ఆ నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు అభినందించారు. రక్తం అందుకున్న రోగులు, వారి కుటుంబీకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

యాదవులకు సముచిత స్థానం కల్పించాలి


జిల్లా యాదవ సంఘానికి ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లాలో యాదవులకు అన్ని పార్టీలు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడు మందపాటి బాలు డిమాండ్ చేశారు. స్థానిక గొల్లగూడెంలో ఆదివారం జరిగిన జిల్లా యాదవ సంఘం సమావేశంలో బాలు మాట్లాడారు. జిల్లాలో ఉన్న యాదవులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ పార్టీలు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమావేశంలో జిల్లా యాదవ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడిగా కోరశిఖ వీర వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడిగా బర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మందపాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గుండుమేను ప్రసన్న మణికంఠస్వామి, సంయుక్త కార్యదర్శిగా సూరిబోయిన సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పాశం చింతారావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు మందపాటి బాలు, మహిళా విభాగం అధ్యక్షురాలు చేకూరి లక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని వారు అభినందించారు. జిల్లా నూతన కార్యవర్గం జిల్లాలో యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేసింది. సమావేశంలో జిల్లాకు చెందిన యాదవ పెద్దలు, వివిధ ప్రాంతాల యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అశోక్ సేవలు అభినందనీయం


అశోక్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హరి మనో వికాస కేంద్రం నిర్వాహకులు తదితరులు

అమలాపురం రూరల్: హరి మనో వికాస కేంద్రం వ్యవస్థాప అధ్యక్షుడు నల్లాబత్తుల అశోక్‌కుమార్ హరి మనో వికాస కేంద్రం స్థాపించి ఎంతోమంది మానసిక దివ్యాంగులకు సేవలు అందించారని కేంద్రం డైరెక్టర్ ఎస్.రాజకుమార్ అన్నారు. ఈదరపల్లిలో హరి మనోవికాస కేంద్రం వ్యవస్థాప అధ్యక్షుడు దివంగత నల్లాబత్తుల అశోక్ కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. పాఠశాల నిర్వాహకులు నల్లాబత్తుల రాజశేఖర్ అధ్యక్షతన ఆదివారం సంతాన సభ నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ అశోక్ ఆశయాలను కొనసాగిస్తూ విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు ఆయన సేవా కార్యక్రమాలను కొనియాడారు. పాఠశాల నిర్మాణం కోసం ప్రభుత్వం భూమి కేటాయించాలని నిర్వహణ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. పి.ఆనంద్, లోకేష్, బాబి, సూర్య, కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అమలాపురం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయి. ఈ పది పరీక్షలు ఈ నెల 31వ తేదీ వరకూ జరగనున్నాయి. పట్టణ, రూరల్ మండలంలో 9 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు మండల విద్యాశాఖ అధికారి–1, డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాష్ తెలిపారు. రూరల్ మండలంలో పేరూరు, బండారులంక, వన్నెచింతలపూడి, కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమలాపురం పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలు, కొంకాపల్లి, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలు, ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు.ఈ కేంద్రాల్లో మొత్తం 2,195 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాలకు గంట ముందే వెళ్లాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి, వైద్య సదుపాయం కల్పించారు.

ఐ.పోలవరం మండలంలో..

ఐ.పోలవరం : ఐ పోలవరం మండల పరిధిలో మొత్తం 797 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. జెడ్పీహెచ్ఎస్ ఐ పోలవరం–ఏ సెంటర్‌లో 200 మంది, బీలో 177 మంది, జెడ్పీహెచ్ఎస్ మురమళ్లలో 240 మంది, సాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మురమళ్ల సెంటర్‌లో 180 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్ష నిర్వహణ నిమిత్తం నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను 42 మంది ఇన్విజిలేటర్లును నియమించినట్లు తెలిపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఏ మంగాయమ్మ తెలిపారు. మండలంలో 1,115 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. వీరిలో తాళ్లరేవు హైస్కూల్‌లో 295 మంది, పటవల హైస్కూల్‌లో 230 మంది, బొడ్డు చినవెంకటాయపాలెం హైస్కూల్‌లో 220 మంది, పి.మల్లవరం హైస్కూల్‌లో 180 మంది, ఇంజరం హైస్కూల్‌లో 190 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను విద్యార్థులు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

అసెంబ్లీ ఎన్నికలకు కార్యాచరణ సిద్ధం

యానాం: వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కార్యాచరణతో సిద్ధంగా ఉందని ఆ పార్టీ పుదుచ్చేరి ఇన్‌చార్జి గిరిష్ చోదంకర్ పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎగ్జిక్యూటివ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలను ఎదుర్కోవడంలో భాగంగా ఇప్పటికే పోలింగ్ బూత్ స్థాయి నుంచి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికలకు కేవలం 9 నెలలు మాత్రమే గడువు ఉందని, అందరూ తమ నియోజకవర్గాల్లో పార్టీ పటిష్ఠత తదితర పనులను ప్రారంభించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో పూర్తి స్థాయిలో ఈ ఎన్నికలపై ఆ పార్టీ ప్రభావం చూపుతుందని అన్నారు. బీజేపీపై ఈవీఎం మిషన్ల ట్యాంపరింగ్ గురించి కోర్టులో ఉందన్నారు. ఎంపీ వైథిలింగం మాట్లాడుతూ పార్టీ పోటీ చేసే 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లోను కావాల్సిన పనులను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురాజ్ హేగ్డే, మాజీ సిఎం నారాయణసామి, మాజీ మంత్రులు కందసామి, షాజహాన్, ఎమ్మెల్యే వైద్యనాథన్, మాజీ ఎమ్మెల్యే అనంతరామన్ తదితరులు పాల్గొన్నారు

లోవోల్టేజీ సమస్యకు చెక్

కాట్రేనికోన: లోవోల్టేజీతో ఇబ్బంది పడుతున్న మండల ప్రజల సమస్యకు చెక్ పెట్టారు. లోవోల్టేజీ సమస్యను మండల ప్రజలు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలియజేశారు. దీంతో ఆయన స్పందించి చెయ్యేరు, కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్లలో 8 పీటీఆర్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాట్రేనికోన, చెయ్యేరు సబ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన 8 పీటీఆర్‌లను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ లైన్ ఎక్కువ దూరం కావడంతో పల్లంకుర్రు పరిసర ప్రాంతంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

అమలాపురం వైశ్య సంఘ నాయకులు


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌పీఎ మునిస్వామి, అధికారులు


తాళ్లరేవులో శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి రామచంద్రరావు


అమలాపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు అజరామరమని పట్టణ ఆర్య వైశ్య సంఘం నాయకులు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వైశ్య సంఘం ప్రతినిధులు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఆ కల్యాణ మండపంలోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక పొట్టి శ్రీరాములు షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్) ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కూడా వైశ్య నాయకులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సర్క్యులర్ బజార్ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వద్ద జయంతి కార్యక్రమం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వై.అనంతలక్ష్మి, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

తాళ్లరేవు: ఆంధ్రరాష్ట్ర అవతార పురుషుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం తాళ్లరేవులో నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఆయన త్యాగనిరతిని తెలుగు జాతి మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, వాసవీక్లబ్ ప్రతినిధులు భారతి, సతీష్, సుభాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఉద్యమ స్ఫూర్తి ఆదర్శనీయం

అమలాపురం టౌన్: భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం నాడు పొట్టి శ్రీరాములు ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక సర్క్యులర్ బజార్ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించి, ప్రసంగించారు. మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు నూలు కృష్ణ, ఖ్వాజాబాబు తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు త్యాగాలను కొనియాడారు.

యానాం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. స్థానిక ఫెర్రీరోడ్డులో పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి తదితరులు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అప్పటి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి, మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, ఎస్సై మురుగానందన్, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ప్రశాంతంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష

అమలాపురం రూరల్: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో 170 అభ్యర్థులు రాయాల్సి ఉండగా 79 మంది హాజరయ్యారు. 91 మంది గైర్హాజరైనట్లు కోఆర్డినేటింగ్ ఆఫీసర్ అల్లవరం డిప్యూటీ తహసీల్దార్ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి 12 వరకు పరీక్ష జరిగింది. ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, కళాశాల ప్లేస్మెంట్ అధికారి అడబాల కుమార్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

తాళ్లరేవు: మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం జాతీయ రహదారి 216లో పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్సై తెలియజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై వేధింపులకు నిరసనగా యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 27వ రోజు ఆదివారం గేట్ మీటింగ్‌లో నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు మాట్లాడుతూ అమలాపురం డిపోలో 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమంగా సస్పెండ్ అయిన డ్రైవర్ నారాయణను డ్యూటీలోనికి తీసుకోవాలని, రాజోలు నుంచి వచ్చిన డ్రైవర్ కేజీ రావు డ్రైవర్ కం కండక్టర్ డ్యూటీకి వెళ్లాలని వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి డ్రైవర్ డ్యూటీకి మాత్రమే పంపాలని, తదితర డిమాండ్ చేశారు. బేషరతుగా ఇద్దరు డ్రైవర్లను డ్యూటీ తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు హౌలియా డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పరామర్శ

అమలాపురం రూరల్: మాతృ వియోగంతో బాధపడుతున్న దండోరా నాయకుడు ఆకుమర్తి రమేష్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించారు. అమలాపురం రూరల్ మండలం పేరూరు ఇందిరానగర్ కాలంలోని రమేష్ స్వగృహానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ వెళ్లి రమేష్ మాతృమూర్తి పార్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

ఓడలరేవు గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు

అల్లవరం: ఓడలరేవు గ్రామంలో ఓఎన్‌జీసీలో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, సీఎస్ఆర్ నిధులు సక్రమంగా వినియోగించి గ్రామ అభివృద్ధి చేయాలని టెర్మినల్ వద్ద 13 రోజు ఆదివారం ఓడలరేవు గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. చమురు సంస్థల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. అల్లవరం మండల జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.

డీఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విజేత కోరంగి


జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన డీఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విజేతగా కోరంగి జట్టు నిలిచింది. సుమారు 36 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంటులో కోరంగి, గాడిమొగ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో గాడిమొగ జట్టుపై కోరంగి జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. సీతారామపురం, తాళ్లరేవు జట్లు మూడు నాలుగు స్థానాల్లో నిలిచాయి. నాయకులు సాయి, లక్ష్మణరావు, వెంకటరమణ, వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.